

పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో సాగునీరు విడుదల చేసి నెల రోజులైనా పూర్తిస్థాయిలో నీరందడం లేదని, నేటికి నారుమడులు వేసే పరిస్థితి లేకుండా పోయిందని ఏపి కౌలురైతుల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ముందస్తు సాగుఅంటూ గతనెల ఒకటో తేదీన సాగునీరు విడుదల చేసిందని తెలిపారు. పంట కాలువలు ఆధునీకరించకపోవడం, పూర్తిస్థాయిలో నీరు విడుదల చేయకపోవడంతో జిల్లాలో అనేకప్రాంతాల్లో నారుమడులు వేయలేదన్నారు. తీరప్రాంత మండలాలైన యలమంచిలి, పాలకొల్లు, నరసాపురం, మొగల్తూరు, భీమవరం వంటి మండలాల్లో ఎక్కతడిపి మురుగు కాలువలు అభివృద్ధి చేయకపోవడంతో కొద్దిపాటి వర్షం వచ్చినా పంటలు మునిగిపోతున్నాయనే ఆందోళనతో నేటికీ నారుమళ్లు వేయలేదని పేర్కొన్నారు. సాగునీరు పూర్తిగా విడుదల చేసి, మురుగు కాలువలను తవ్వాలని డిమాండ్ చేశారు.

నష్టాల సాగు..!



భారీగా పెరిగిన పెట్టుబడి ఖర్చులు
భారంగా ఎరువులు, పురుగు మందుల ధరలు
ఎకరాకు రూ.40 వేల వరకూ పెట్టుబడి
వచ్చేది రూ.50 వేలు మాత్రమే
కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణం
సాగుకు వెనుకాడుతున్న కౌలురైతులు
బీడువారుతున్న వందలాది ఎకరాలు

ప్రజాశక్తి - భీమవరం

ఆరుగాలం శ్రమించే రైతన్న కష్టమంతా పెట్టుబడికే సరిపోతోంది. పెరిగిన కూలి రేట్లు, ఎరువులు, పురుగు మందుల ధరలకు రైతులు ఆర్థికంగా నలిగిపోతున్నారు. ఎకరాకు రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకూ పెట్టుబడి పెడుతున్న రైతన్న పంట ఆశాజనకంగా పండితే రూ.50 వేల వరకూ వస్తున్న పరిస్థితి ఉన్నప్పటికీ ప్రకృతి వైపరీత్యాలతో అది కూడా అందే పరిస్థితి కనిపించడం లేదు. కౌలురైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. రైతులకు ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో సాయం అందకపోవడంతో సాగుకు నానాతంటాలు పడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో సార్వాసాగుకు వ్యవసాయ శాఖ ముందస్తు ప్రణాళిక రూపొందించినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో నారుమడులు పూర్తిస్థాయిలో పోయలేదు. పశ్చిమగోదావరి జిల్లాలో గత నెల ఒకటో తేదీన కాలువలకు నీటిని విడుదల చేసినప్పటికీ శివారు ప్రాంత పొలాలకు నీరు అందే పరిస్థితి లేదు. దీనికి తోడు సాగులో ఎన్నో సమస్యలు, ఇబ్బందులు వెంటాడుతుండటంతో సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటివరకూ కేవలం 40 శాతం మాత్రమే నారుమడులు ప్రక్రియ పూర్తయింది. మిగతాది మరో వారం పది రోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉన్నట్టు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో రెండు లక్షల 46 ఎకరాలు, ఏలూరు జిల్లాలో లక్షా 40 వేల ఎకరాల్లో వరిసాగు జరుగుతోంది. ఈ ఏడాది సార్వా సాగుకు సన్నద్ధమవుతున్నారు. రెండు జిల్లాల్లో సుమారు ఏడు లక్షల మంది రైతులుండగా దీనిలో సుమారు నాలుగు లక్షల మంది వరకూ కౌలు రైతులే ఉన్నారు. నూటికి 90 శాతం కౌలు రైతులే సాగుచేస్తున్నారు. అయితే వ్యవసాయంలో కౌలు రైతులకు పూర్తిస్థాయిలో చేయూత లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతూ ఆర్థికంగా అష్ట కష్టాలు పడుతున్నారు. ముఖ్యంగా గతంతో పోల్చితే వ్యవసాయంలో అనేక మార్పులతో పాటు యాంత్రీకరణ కూడా రావడం, కూలి ధరలు, ఎరువులు, పురుగుమందులు ధరలు పెరిగిపోవడంతో పెట్టుబడి ఖర్చులు అమాంతంగా పెరిగాయి. ఈ నేపథ్యంలో వరిసాగులో రైతన్నల కష్టం పెట్టుబడికే సరిపోతోంది. పెట్టుబడులు పెరగడంతో పంట పండినప్పటికీ ఆదాయం కనిపించకపోవడంతో రైతులు తీవ్ర నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సార్వా సీజన్‌లో కూలి ధరలు బాగా పెరిగిపోయాయి. ఎకరాకు సరాసరి రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకూ పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎకరాకు రూ.50 వేల వరకూ వస్తున్నప్పటికీ కేవలం రూ.10 వేలు మాత్రమే రైతు చేతికి లాభం అందుతుంది. అది కూడా ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా పంట సంపూర్ణంగా చేతికందితేనే. కొన్ని పరిస్థితుల్లో పెట్టిన్నవ కూడా రైతులకు వచ్చే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందడం లేదు. రైతు భరోసా, పంట నష్టపరిహారం, పంటల బీమా, రుణాలు సైతం పూర్తిస్థాయిలో అందకపోవడంతో కౌలురైతులు ఆర్థికంగా నలిగిపోతున్నారు. దీంతో పాటు మానసికంగా కుంగిపోతున్నారు. దీంతో సాగు చేయ కుండానే పంటలు వదిలేసిన పరిస్థితులున్నాయి. జిల్లాలో నరసాపురం, యలమంచిలి, పాలకోడేరు, గణపవరం, భీమవరం రూరల్ పరిధిలోని భూములు బీడుగా వదిలేస్తున్నారు. గతేడాది సార్వాలో 20 వేల హెక్టార్లలో సాగు చేయకుండా వదిలేశారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

అందని ప్రభుత్వ సాయం

వరిసాగులో ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి సహకారం లేదని పలువురు రైతులు బహిరంగంగా చెబుతున్నారు. ప్రభుత్వ లబ్ధి భూ యజమాని అంగీకారం లేకపోవడంతో కౌలు రైతులు పూర్తిగా నష్టపోతున్నారు. అయితే ఎక్కువ శాతం కౌలురైతులు సాగు చేస్తున్నప్పటికీ వారికే చేయూతనందించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ప్రభుత్వం అందించే లబ్ధిలో కూడా సవాలక్ష నిబంధనలు పెట్టి అసలైన సాగుదారులకి అన్యాయం చేస్తున్నారు. సాగులో ప్రధానపాత్ర పోషించే యాంత్రిక పనిముట్లకు ఉమ్మడిజిల్లాలో గత ప్రభుత్వం రూ.25 కోట్ల వరకూ బడ్జెట్ కేటాయించినప్పటికీ అది ఇప్పుడు నిలిపివేయడంతో పనిముట్లు కొనాలంటే రైతులకు భారంగా మారింది. రైతులకు యాంత్రిక పనిముట్లు సబ్సిడీ సుమారుగా రూ.30 వేల వచ్చేది. ప్రభుత్వ సహకారం లేకపోవడంతో రైతులు సాగుకు వెనుకడుగువేస్తున్నారు. భూమిని చూసైనా కొంతమేర అప్పు పుడుతుందనే ఉద్దేశంతో సాగుచేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

తగ్గుతున్న వరిసాగు

రానురాను వరిసాగు లీజు గణనీయంగా తగ్గిపోతోంది. ముఖ్యంగా కౌలురైతులు వరిసాగుకు వెనుకడుగు వేస్తున్నారు. లీజు కొన్నిప్రాంతాల్లో ఒకలా ఉంటే మరికొన్ని ప్రాంతాల్లో మరోలా ఉంది. అయితే ఈ ఏడాది వరి సాగులో కౌలు రేటు పెరిగినట్టు తెలుస్తుంది. దీనికి అనేక కారణాలు కూడా ఉన్నాయి. వరిసాగు చేసేవారు లేక కొన్ని ప్రాంతాల్లో కౌలు రేటు తగ్గితే, చేలు బాగాపండే చోట్ల అధికంగా ఉంది. ఎకరాకు 12 బస్తాల నుంచి 16 బస్తాల వరకూ లీజు ఉండేది. అటువంటిస్తా 10 బస్తాల్లోపు కొన్ని ప్రాంతాల్లో ఆరు బస్తాలు పడిపోయింది. దీనికి కారణం పెట్టుబడి పెరగడంతో కౌలు రైతులు తగ్గిపోవడమేనని భూమి యజమానులు అంటున్నారు. ఎకరా రూ రూ.40 లక్షలు నుంచి రూ.కోటి ఉంటే ఏడాది మొత్తం వ్యవసాయం చేసినప్పటికీ ఆదాయం మాత్రం రూ.20 వేలు వస్తుందని రైతులు చెబుతున్నారు.

ఎకరానికి పెట్టుబడి ఖర్చులు ఇలా..

నారుమడికి రూ.1800, దమ్ముకు రూ.నాలుగు వేలు, గట్టులంకకు రూ.1400, బాగుచేతకు రూ.1400, నాట్లు వేయడానికి రూ.ఆరు వేలు, కలుపు తీతకు రూ.1800, ఎరువులు రూ.ఏడు వేలు, పురుగు మందులు రూ.6800, మాసూలు కూలి రూ.3300, పంట మాసూళ్లు రూ.7400 మొత్తం కలిపి రూ ఆయా ప్రాంతాలను బట్టి రూ.35 వేలు నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడి అవుతుంది.

పురుగుమందుల ధరలు భారీగా పెరిగాయి

కడలి ఆంజనేయులు, కౌలు రైతు, చిట్టవరం




నేను 15 ఏళ్ల నుంచి కౌలుకు వ్యవసాయం చేస్తున్నాను. ప్రస్తుతం ఎకరం 50 సెంట్లు మాత్రమే సాగు చేస్తున్నాను. అప్పటికీ, ఇప్పటికీ సాగులో వ్యత్యాసం పెరగడంతో కౌలు ధర తగ్గినట్లు వచ్చాను. ఎరువులు, పురుగు మందుల ధరలు విపరీతంగా పెరిగాయి. యాంత్రీకరణ రావడం, ప్రభుత్వసాయం అంతంతమాత్రంగా ఉండటంతో మరింత భారం పెరిగింది.

కౌలు రైతులను ఆదుకోవాలి

మామిడిశెట్టి రామాంజనేయులు, కౌలు రైతు సంఘం పశ్చిమ జిల్లా కార్యదర్శి



ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ పాలకులు ఏలుతున్న కవులు రైతుల సమస్యలు పట్టించుకున్న దాఖలాల్లేవు. సాగులో కౌలు రైతులు ఆర్థికంగా అష్ట కష్టాలు ఎదుర్కొంటున్నారు. వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వడం లేదు. కౌలు రైతులను ప్రభుత్వం మోసం చేస్తుంది. రైతు భరోసా, పంట నష్ట పరిహారం, పంటల బీమా, బ్యాంకు రుణాలు పూర్తిస్థాయిలో అందడం లేదు. నామమాత్రంగా అందించి చేతులు దులుపుకుంటున్నారు. కౌలు రైతులను ఆదుకోవాలి.



మాట్లాడుతున్న జుత్తిగ నరసింహమూర్తి

ఉపాధి కోసం ఐక్యంగా ఉద్యమించాలి

కల్లుగీత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి

ప్రజాశక్తి - తణుకు రూరల్

గీత కార్మికుల ఉపాధి కోసం ఐక్యంగా ఉద్యమించాలని కల్లుగీత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి అన్నారు. ఆదివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కమిటీ, సొసైటీ అధ్యక్షుల విస్తృత సమావేశం తణుకు అమరవీరుల భవనంలో జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ నేటికీ వృత్తినే నమ్ముకుని లక్షలాది మంది జీవిస్తున్నారన్నారు. వారి బతుకులకు భరోసా కల్పించి వృత్తిలో ఉపాధి అవకాశాలు మెరుగుపరిచాల్సిన రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులను గాలికి వదిలేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు పాదయాత్రలో సిఎం జగన్ చేసిన వాగ్దానాలు, ఇచ్చిన హామీలు గుర్తు లేవా అని ప్రశ్నించారు. ఒక్కటిగా ఉన్న గీతకార్మికులను కులాల పేర్లతో చీల్చి వారిమధ్య చిచ్చుపెట్టారని విమర్శించారు. 1991లో పోరాడి సాధించుకున్న గీతకార్పొరేషన్‌ను వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేయడం బాధాకరమన్నారు. ప్రభుత్వం కులాల పేర్లతో కార్పొరేషన్లు పెట్టి గీత కార్మికుల మధ్య చిచ్చు పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మద్యపాన నిషేధం విధిస్తామని హామీ ఇచ్చి నేడు ప్రభుత్వమే చీప్ లిక్కర్ వరదలా పారిస్తూ గీత కార్మికుల జీవనోపాధిని దెబ్బ తీసిందని విమర్శించారు. హర్యానా, గోవా తదితర రాష్ట్రాల నుండి మద్యం అక్రమంగా వరదలా ఆంధ్రాకు ఎలా పారుతుందని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రంలో బతకలేక వృత్తిని వదులుకుని గీత కార్మికులు భాగ్యనగరాలకు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నాలుగేళ్ల కాలంలో గీత కార్మికులకు వైసిపి ప్రభుత్వం ఏమి చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కేరళ, తెలంగాణ ప్రభుత్వాలు గీత కార్మికులకు భరోసా ఇస్తు అన్నివిధాలా ఆదుకుంటూ, కొండంత ధైర్యాన్నిస్తూ గీత కార్మికుల కుటుంబాల్లో ఆనందాన్ని కలుగజేస్తుంటే మనరాష్ట్రంలో గీత కార్మికులు కన్నీళ్లు పెట్టే పరిస్థితి వైసిపి ప్రభుత్వం కల్పించటం సిగ్గు చేటన్నారు. గీత కార్మికుల జీవితాల్లో మార్పు రావాలంటే వృత్తిఆధునికీకరణ, నీరా, తాటి ఉత్పత్తులు పరిశ్రమల ఏర్పాటు, గీత కార్మికుల సంక్షేమం, సామాజిక భద్రత, వృత్తి సంక్షేమం, వృత్తిలో ఉపాధి అవకాశాల కోసం పోరాటాలు చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం కిస్తీలు రద్దు చేసి చెట్లపై హక్కు లేకుండా చేసి వృత్తిని దెబ్బతీసిందన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు తాటి చెట్లను నరికి వేస్తున్నా చర్యలు తీసుకోవాల్సిన చట్టం ఉన్నా వైసిపి ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. వృత్తి చేస్తూ ఇటీవల కాలంలో చాలా మంది ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయినవారు, గాయపడినవారు ఉన్నారని, వారికి పరిహారం అందడం లేదన్నారు. ప్రభుత్వం ఆర్భాటంగా మృతులకు రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని ప్రకటించిందని, కానీ ఈ రోజు వరకూ విధి విధానాలు ఎందుకు ప్రకటించ లేదని ప్రశ్నించారు. గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాడాల్సిం దేనన్నారు. ఈ సమావేశంలో కడలి పాండు, బొక్కా చంటి, గుబ్బల వీర రాఘవులు, కాగిత రాధాకృష్ణ, మామిడిశెట్టి నాగ భూషణం, కోమిటి శ్రీనివాస్, గుబ్బల నరసింహస్వామి, బొక్కా సోమేశ్వరరావు, చింతపల్లి వీరాస్వామి, కోమిటి సత్యనారాయణ, దాసరి సూరిబాబు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యాన 'హింసపై మహిళల పోరుయాత్ర'

ప్రజాశక్తి - భీమవరం



పోరుయాత్రలో ఐద్వా నేతలు

ఐద్వా ఆధ్వ ర్యంలో పట్టణంలోని 18వ వార్డులో 'హింసపై మహిళల పోరుయాత్ర' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ, అధ్యక్షురాలు కేతా పద్మజ, సహాయ కార్యదర్శి ఉదయ కుమారి, జిల్లా కమిటీ సభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పూర్ణ మాట్లాడుతూ మద్యం, మత్తు పదార్థాలు నియంత్రించి మహిళలపై హింస లేని సమాజాన్ని నిర్మించాలని మహిళా పోరుయాత్ర ప్రారంభించామని తెలిపారు. దేశంలో, రాష్ట్రంలోని చిన్నారులపై, మహిళలపై హింస రోజు రోజుకూ విపరీతంగా పెరుగుతోందన్నారు. మహిళా మల్ల యోధులు ఢిల్లీలో చేసిన ఆందోళన అందుకు నిదర్శనం అన్నారు. ప్రభుత్వాలు హింసను అరికట్టే వరకూ మహిళలు ఆందోళన చేస్తూ ఉండాలని, అందుకే ఐద్వా ఆధ్వర్యంలో మహిళల పోరు యాత్ర చేపట్టిందని ఆమె తెలిపారు. రక్షణ కల్పించే చట్టాలను కఠినంగా అమలు చేయాలని, ప్రభుత్వం మీడియా మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని, కాలేజీల్లో, పని ప్రదేశాల్లో వేధింపులు నిరోధించేందుకు అంతర్గత ఫిర్యాదు కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని వామపక్షాలను కూడగట్టి ఈ నెల 5న ఆందోళన నిర్వహిస్తామని, రాష్ట్రవ్యాప్తంగా మహిళల పోరు యాత్రలు చేపట్టారని అందరూ దీనికి సహాయ, సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి సిహెచ్ వరలక్ష్మి, సరోజినీ, తాడేపల్లిగూడెం పట్టణ కార్యదర్శి యశోద, పాలకొల్లు పట్టణ కార్యదర్శి బాసిన శ్యామల పాల్గొన్నారు.

రీ సర్వే త్వరగా పూర్తిచేయాలి : డిఆర్ఒ

ప్రజాశక్తి - కాళ్ల

భూముల రీ సర్వే సకాలంలో పూర్తిచేయాలని ఆర్‌డిఒ దాసిరాజు సంబంధిత అధికారులకు సూచించారు. పెదఅమిరం గ్రామంలో జరుగుతున్న రీ సర్వే పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఆన్‌లైన్ పనులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల రీ సర్వేతో పేదలకు భూ వివాదాలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. పారదర్శకంగా సర్వే చేయాలని సూచించారు. ఆర్‌డిఒ వెంట తహశీల్దార్ టిఎ.కృష్ణారావు, విఆర్‌ఒలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నేతలు

విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలి

వ్య.కా.స ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - పాలకోడేరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉప సంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. గొరగనమూడి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆదివారం వ్యవసాయ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ సహజంగా కరెంటు పట్టుకుంటే షాక్ కొడుతుంది.. కానీ విద్యుత్ బిల్లు చూస్తే షాక్ కొట్టడం ఈ ప్రభుత్వాల పనితీరుకు నిదర్శనం అన్నారు. అదనపు ఛార్జీలు, విద్యుత్ కోతలతో ప్రజానీకం ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో వచ్చిన బిల్లులకు రెండు రెట్లు అదనంగా ఛార్జీలు పెంచడం దారుణమన్నారు. సర్వీస్ ఛార్జీల పేరుతో బిల్లులో 2014 సంవత్సరంలో వినియోగించిన విద్యుత్‌కు మళ్లీ యూనిట్ 20 పైసలు, 2021 మేలో వినియోగించిన విద్యుత్‌కు యూనిట్‌కు మరో రూ.20 పైసలు, 2023 ఏప్రిల్‌లో ఉపయోగించిన కరెంటుకు యూనిట్‌కు రూ.40 పైసలు కలిపి మొత్తం యూనిట్‌కు 80 పైసలు చొప్పున జనం నెత్తిన బండ వేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం విద్యుత్ ఛార్జీలు, ట్రూ అప్‌ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీల భారాన్ని విరమించుకోవాలన్నారు. స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దుచేయాలని లేని పక్షంలో ప్రజలను ఐక్యం చేసి మరో విద్యుత్ ఉద్యమానికి సన్నద్ధమౌతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శేషాపు అశ్రియ్య, కరిదిండి గోపాలరావు, స్థానికులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలను ఉపసంహరించాలి

పోడూరు: విద్యుత్ ఛార్జీల భారాలను ప్రభుత్వం తక్షణం విరమించుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ట్రాన్స్‌కో ఎఇ శ్రీనివాస్‌కు వినతిని అందించారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం విద్యుత్ బిల్లులు మోతమోగుతున్నాయని ప్రజలు ఆవేదన చెందుతుంటే మూలిగే నక్కపై తాటిపండు పడినట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి స్మార్ట్ మీటర్లు పెట్టాలని, ట్రూ అప్ ఛార్జీలు అంటూ ప్రజలపై మరింత భారాలు మోపుతున్నారని విమర్శించారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బురాబత్తుల వెంకటరావు, మహిళలు పాల్గొన్నారు.



సముద్ర కెరటాల్లో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

పేరుపాలెంబీచ్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక, ద్విచక్ర వాహనాల్లో ఉదయమే బీచ్‌కు చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేద తీరారు.

ఉత్సాహభరితం.. ఉత్తేజ పూరితం

కృష్ణాజిల్లాలో సాగిన పోలవరం పోరుకేక మహాపాదయాత్ర

బాపులపాడు, ఉంగుటూరు, గన్నవరంలో ఘనస్వాగతం

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి, గన్నవరం

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం ఇచ్చిన తర్వాతే ప్రాజెక్టు పనులు పూర్తిచేయాలని కోరుతూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వంలో 'పోలవరం పోరుకేక' మహాపాదయాత్ర ఉత్సాహంగా కొనసాగుతోంది. కృష్ణాజిల్లాలోని బాపులపాడు, ఉంగుటూరు, గన్నవరం మండలాల్లోని పర్యటించిన అన్ని గ్రామాల్లోని ఆయా గ్రామాల ప్రజానీకం, రైతులు, కూలీలు, సిపిఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలవర్షం కురిపించారు. కొన్నిచోట్ల మహిళలు హారతులు ఇచ్చారు. 13వ రోజు మండుటెడను, వేడిగాలులను సైతం లెక్కచేయకుండా యాత్ర బృందం ముందుకు సాగింది. 13వ రోజు ఆదివారం బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్ నుంచి గన్నవరం వరకూ కొనసాగింది. అల్లూరు సీతారామరాజు, ఏలూరు, కృష్ణాజిల్లాలోని 11 మండలాల్లో యాత్ర పూర్తి చేసుకుంది.

సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలవరం పోరుకేక మహా పాదయాత్రకు కృష్ణాజిల్లాలో అడుగడుగునా ఘనస్వాగతం లభిస్తోంది. బాపులపాడు మండలంలో ఆదివారం 13వ బృందం పర్యటించింది. మండుటెడను, వేడిగాలలను సైతం లెక్కచేయకుండా ముందుకు సాగింది. గ్రామ గ్రామాన పేదలు, రైతులు, కూలీలు, టిడిపి, వైసిపి నాయకులు యాత్రపై పూలవర్షం కురిపించారు. నిర్వాసితుల పోరాటానికి తమ మద్దతు ప్రకటించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వంలో సాగుతున్న యాత్ర బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్ నుంచి ఆదివారం బయలుదేరింది. వీరవల్లి ముఖద్వారం వద్దకు రాగానే తెలుగు రైతు రాష్ట్ర నాయకులు గుండపనేని ఉమావరప్రసాద్ స్వాగతం పలికి సంఘీభావం ప్రకటించారు. గ్రామంలోని సచివాలయం సెంటర్లో ఆశా వర్కర్లు, అంగన్వాడీ ఉద్యోగులు స్వాగతం పలికారు. అనంతరం ఎన్టీఆర్ బొమ్మ సెంటర్‌లో వైసిపి నాయకులు కృష్ణప్రసాద్, చిలకపాటి పద్మనాభరావు, ఇతర రైతు నాయకులు, గ్రామ పెద్దలు యాత్రకు పూలతో స్వాగతం పలికారు. యాత్ర బృందానికి మజ్జిగ, మంచి నీరు అందించారు. అంగన్వాడీ, ఆశా ఉద్యోగులు యాత్ర సారథి శ్రీనివాసరావును కలిసి తమ మద్దతు తెలిపారు. కోడూరుపాడు పంచాయతీలోని ఉమామహేశ్వరపురంలో యాత్రకు వ్యవసాయ కార్మికులు స్వాగతం పలికారు. శ్రీనివాసరావుకు మహిళలు వీర తిలకం దిద్దారు. యాత్ర బృందం సభ్యులకు మజ్జిగ అందజేశారు. అనంతరం పాదయాత్ర బాపులపాడు మండలం అంపాపురం మీదుగా ఉదయం 8 గంటలకు బయలుదేరిన యాత్ర మధ్యాహ్నం 12 గంటలకు తేలప్రోలుకు చేరింది. తేలప్రోలులో పార్టీ నాయకులు టి.వి.లక్ష్మణస్వామి, ఉంగుటూరు మండలకార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు, వెన్నూతల సర్పంచ్ తెల్లాకుల రామ్మోహనరావు, పార్టీ సీనియర్ నాయకులు పిల్లి రాజారావు, సలీమ్, భీమవరపు సుబ్బారెడ్డి తదితరులు స్వాగతం పలికారు. నాయకులకు పూ లమాలలు వేశారు. పొట్టిపాడులో పార్టీ నాయకులు, రైతులు స్వాగతం పలికారు. ఆత్కూరులో ఎన్టీఆర్ విగ్రహానికి సిపిఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్ద ఆవుటపల్లిలో ఉపాధి కూలీలు, మహిళలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. యాత్రబృంద నాయకులకు పూలమాలలు వేసి రెడ్ సెల్యూట్ చేశారు. అనంతరం చిన ఆవుటపల్లి మీదుగా పాదయాత్ర గన్నవరం చేరకుంది. పిన్నమనేని ఆసుపత్రి వద్ద గన్నవరం మండలానికి చెందిన సిపిఎం నాయకులు స్వాగతం పలికి నాయకులపై పూలవర్షం కురిపించారు. మధ్యాహ్నం తేలప్రోలు ఐటిఐ కాలేజీలో విరామం తర్వాత బయలుదేరిన యాత్ర పొట్టిపాడు, ఆత్కూరు, అవుటపల్లి మీదుగా గన్నవరం చేరుకుంది. ఆత్కూరులో తెలంగాణా సాయుధ పోరాట వీరుడు అన్నే రామారావు విగ్రహానికి వి.శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గన్నవరం ఆర్టీసీ బస్టాండ్ వద్ద సిపిఎం గన్నవరం మండల నాయకులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు.



8వ వార్డులో సైకిల్‌పై వెళ్తూ పేపర్ వేస్తున్న నిమ్మల రామానాయుడు

పేపరు వేస్తూ ఎంఎల్ఎ నిమ్మల నిరసన

ప్రజాశక్తి - పాలకొల్లు

టిడ్కో గృహాల్లో ఆఖరి లబ్ధిదారుడు గృహ ప్రవేశం చేసే వరకూ ప్రతినెలా సైకిల్‌పై తాను పేపర్ వేస్తానని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆదివారం 2వ రోజు ఆయన పట్టణంలోని 7, 8 వార్డుల్లో పేపర్ వేస్తూ ప్రభుత్వం తీరుపట్ల నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. టిడిపి హయాంలో 90 శాతం పూర్తయిన టిడ్కో గృహాలకు వైసిపి రంగులు మార్చిందని, ఈ సొమ్ముతో కనీస అవసరాలు తీరేవని తెలిపారు. టిడిపి హయాంలో 1856 గృహాలు నూరుశాతం పూర్తి కాగా, వాటికి వైసిపి రంగులు వేసి లబ్ధిదారులకు ఇచ్చారని చెప్పారు.



నీట్ విద్యార్థిని అభినందిస్తున్న కలెక్టర్

విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు

ప్రజాశక్తి - ఆకివీడు

జాతీయ స్థాయి నీట్‌లో 277వ ర్యాంకు సాధించిన ముదుండి నితిన్ వర్మను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ప్రత్యేకంగా అభినందించారు. ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి హాజరైన కలెక్టర్ నితిన్‌వర్మను అభినందించి సత్కరించారు. పలు సూచనలు చేశారు. అలాగే పదో తరగతి ఫలితాల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను అభినందించారు. లయన్స్ క్లబ్ విద్యార్థులకు నగదు బహుమతులను కలెక్టర్ చేతుల మీదుగా అందించారు.




ఉండి :బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న సభ్యులు

అగ్నిప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ చేయూత

ప్రజాశక్తి - ఉండి

రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు ఆదివారం అందజేసింది. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ డాక్టర్ ఎంఎస్‌వి.బద్రిరాజు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సూచనల మేరకు కోలమూరు గ్రామంలోని అగ్నిప్రమాద బాధితుల కుటుంబానికి ఒక టార్పాలిన్, బియ్యం బస్తా, వంట సామగ్రి అందజేసినట్లు తెలిపారు. అనంతరం ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎస్.వీరాస్వామి నాయుడు మాట్లాడుతూ మండలంలో అగ్ని ప్రమాదం సంభవించి నిరాశ్రయులైన వారు తహశీల్దార్ కార్యాలయానికి సమాచారం అందించాలన్నారు. అటువంటి వారికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా తక్షణ సహాయం అందజేస్తామని తెలిపారు. డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు బాధిత కుటుంబాలను పరామర్శించి వైసిపి గ్రామ నాయకుడు గంద్రాజు రాజేష్ వర్మ ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబానికి రూ.5000 ఆర్థిక సహాయం, 26 కేజీల బియ్యం, పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచి నడింపల్లి రాంబాబు రాజు, గ్రామ రెవెన్యూ అధికారి వి.అప్పలాచార్యులు, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు మల్లేశ్వరరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం:చినతాడేపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన నిరాశ్రయులకు ఆదివారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి బియ్యం, దుస్తులు, వంట సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిమి రవికుమార్, పోతుల అన్నవరం, ముప్పిడి రమేష్, అతంటి తాతయ్య, వెంకటరావు, చిటికెన శ్రీనివాసరావు, కిలాడి సాయి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పివిఎల్

మళ్లీ వైసిపిదే విజయం : పివిఎల్

కాళ్ల:రాష్ట్రంలో మరలా వచ్చేది వైసిపి ప్రభుత్వమేనని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు పేర్కొన్నారు. ఆదివారం బొండాడ గ్రామంలో హరిచంద్రపురం ప్రాంత వాసులు వంద మంది పివిఎల్ నరసింహరాజు సమక్షంలో టిడిపి నుంచి వైసిపిలో చేరారు. పివిఎల్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఏ అవసరం వచ్చినా తాను అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ మన్నే నాగరాజు, మాజీ ఎంపిపి కందుల మల్లికార్జునరావు, కోపల్లె సొసైటీ ఛైర్మన్ వేగేశ్న జయ రామకృష్ణంరాజు, మన్నే శ్రీనివాసు, మందపాటి వెంకన్న, కందుల హనుమ, గంగుల విశ్వేశ్వరరావు, మన్నే సోమేశ్వరరావు, వైసిపి నేతలు పాల్గొన్నారు.

లయన్స్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం:లయన్స్ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అందరికీ స్ఫూర్తి దాయకమని జోన్ ఛైర్మన్ లయన్స్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు తెలిపారు. అధ్యక్షులు వంగపండు రామ మోహనరావు ఆధ్వర్యంలో లయన్స్ పసుమర్తి చంద్ర శేఖర శ్రీనివాస రావు ఆర్థిక సహకారంతో ఆదివారం కడకట్ల జనతా ఛారిటబుల్ ట్రస్ట్ హాస్పిటల్‌లో ఉచిత షుగర్ రక్త పరీక్ష శిబిరంను జోన్ ఛైర్మన్ లయన్స్ పేరిచర్ల మురళి కృష్ణంరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ వారు 1964 సంవత్సరం నుంచి చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని సేవలు, వైద్య శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. లయన్స్ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా డయాబెటిస్ అత్యంత ప్రమాదకరంగా మారిందని కనుక ప్రజలందరూ డయాబెటిస్ విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ముఖ్యంగా యువత జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంటూ, డయాబెటిస్ రాకుండా ముందుగా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ శిబిరంలో మొత్తం 121 మంది పరీక్షకు హాజరైనారు. కార్యక్రమంలో తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ సెక్రటరీ చిన్నం జగదీష్, కోశాధికారి జీడిగుంట హరిబాబు, నాగేశ్వరరావు, పచ్చా వెంకటేశ్వరరావు, ఆంజనేయ స్వామి పాల్గొన్నారు.

తాగునీరివ్వండి మహాప్రభో..

ఉండి:తాగునీరు అందించాలని చినపుల్లేరు గ్రామానికి చెందిన మాల మహానాడు నాయకుడు కోనాల ఏసేబు అధికారులను డిమాండ్ చేశారు. ఆదివారం చినపుల్లేరులో పెదపుల్లేరు సొసైటీకి చెందిన గోడౌన్ ఆవరణలో నిర్వహించిన గ్రామసభలో మాల మహానాడు నేత ఏసేబు తాగునీటి కష్టాలను, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోనాల ఏసేబు మాట్లాడుతూ కాలువల ద్వారా నీరు విడుదలై దాదాపు నెల రోజులైనా ఇంతవరకూ పంచాయతీ అధికారులు పట్టించుకోలేదని వాపోయారు. సుమారు మూడు కిలోమీటర్లు వెళ్లి చుట్టుపక్కల గ్రామాల నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నామన్నారు. తాగునీరు సరిగ్గా అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యాలతో ఆడుకునే హక్కు అధికారులకు ఎవరిచ్చారని వారు ప్రశ్నించారు. పశువుల చెరువులో చుట్టుపక్కల నివాసం ఉండే గ్రామస్తులు వ్యర్థాలను, వాడిన మురికి నీటిని, బాత్రూం వాడకపు నీటిని పైపుల ద్వారా చెరువుల్లో వదిలి కలుషితం చేస్తున్న అధికారులు పటించుకోవట్లేదన్నారు. అధికారులు స్పందించి చర్య తీసుకోపోతే, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడమే కాకుండా, ప్రజలందరినీ ఏకం చేసి మాల మహానాడు ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధతం చేస్తామని హెచ్చరించారు. కలుషితమైన ఆ నీటిని తాగడం వల్ల పశువులు రోగాల బారిన పడుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి గ్రామ సమస్యలపై చర్యలు తీసుకోవాలని, ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని వారు కోరారు.

ప్రమాదకరంగా జగన్నాథపురం వంతెన..!

ప్రయాణికుల, రైతుల అవస్థలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని జగన్నాథపురం జెడ్‌పి ఉన్నత పాఠశాల సమీపంలో జిఐండిపి కెనాల్‌పై ఉన్న వంతెన మరమ్మతులకు గురై ప్రమాదకరంగా మారింది. ఇటీవల తవ్వదు ఇసుక్రా లోడుతో లారీ వంతెన పై నుంచి వెళ్తుండగా పగిలిపోయింది. అప్పటి నుంచీ ఆ వంతెనపై నుంచి వాహనాలు వెళ్లేందుకు అవకాశంలేకుండా పోయింది. మత్స్యగడ నుంచి జగన్నాథపురంలోని ఆక్వా చెరువులకు మేత, పట్టుబడి చేసిన మత్స్య ఉత్పత్తులను తరలించేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న నాగిడిపాలెం, దెయ్యాలతిప్ప గ్రామాల మీదుగా చుట్టూ తిరిగి రావాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. దీంతోపాటు అదే పంచాయతీలోని కాలువమొగ, మర్రితిప్ప తదితర గ్రామాల నుంచి కార్లపై పంచాయతీ, సొసైటీ కార్యాలయాలకు వెళ్లేందుకు కూడా చుట్టూ తిరిగి వెళ్లడానికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్‌అండ్‌బి శాఖ ఎఇ నిత్య క్రాంతిను వివరణ కోరగా వంతెన నిర్మాణానికి రూ.1.50 కోట్లు మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. నిధులు మంజూరు చేసిన వెంటనే వంతెన నిర్మిస్తామని తెలిపారు.



ప్రమాదకరంగా ఉన్న జగన్నాథపురం వంతెన

కార్మికుల పిల్లలకు పురస్కారాలు అభినందనీయం : సిఐ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కార్మిక కుటుంబాలకు చెందిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు పురస్కారాలు ఇవ్వడం హర్షణీయమని, అటువంటి ఆలోచన చేసిన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్‌ను అభినందిస్తున్నానని సిఐ వి.నాగరాజు అన్నారు. స్థానిక సిపాయి పేటలోని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కార్మిక హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసే యూనియన్ కార్మిక కుటుంబాల పిల్లల చదువులపై దృష్టి పెట్టడం హర్షణీయమన్నారు. పదో తరగతిలో కష్టపడి చదివి మంచి మార్కులు తెచ్చుకున్నట్లే ఇంటర్‌లో కూడా మంచి ఫలితాలు సాధించాలని కోరారు. విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వాలన్న యూనియన్ ఉద్దేశాన్ని విద్యార్థులు అర్థం చేసుకోవాలన్నారు. విద్యార్థులు తమ బాధ్యతను గుర్తించాలన్నారు. ఎస్ఐ బి.రాజు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం ఎంతో కష్టపడి పనిచేస్తున్నారని, వారికష్టాన్ని గుర్తించి పిల్లలు కూడా కష్టపడి చదవాలని తెలిపారు. ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ మాట్లాడుతూ కార్మిక కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులను చదువులో ప్రోత్సహించడానికి భవన నిర్మాణ కార్మిక సంఘం చేపట్టిన ప్రయత్నం ప్రశంసనీయమన్నారు. పదో తరగతి పాసైన 26 మంది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను, మెరిట్ సర్టిఫికెట్లను సిఐ నాగరాజు, ఎస్ఐ రాజు చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఓసూరి వీర్రాజు, తాడికొండ శ్రీనివాసరావు, కళింగ లక్ష్మణరావు, యూనియన్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐ నాగరాజు



డ్రెయినేజీలో సిల్టు తీయిస్తున్న సర్పంచి

డ్రెయిన్లలో సిల్టు తొలగింపు

ప్రజాశక్తి - పోడూరు

జున్నూరులో రెండు రోజులుగా డ్రెయినేజీల్లో సిల్టు తొలగింపు పనులు చురుగ్గా సాగుతున్నాయి. పనులను ఆదివారం గ్రామ సర్పంచి జమ్ము బేబీ మహాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వి.రాంబాబు, ఉపసర్పంచి దండు గోపాలం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సర్పంచి మహాలక్ష్మి మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో గ్రామంలోని అన్ని ప్రాంతాల్లోని డ్రెయినేజీల్లో సిల్ట్ తొలగింపు పనులు చేపట్టినట్లు తెలిపారు. పారిశుధ్య కార్మికుల కొరత కారణంగా తణుకు నుంచి ప్రత్యేకంగా కార్మికులను రప్పించి పనులు నిర్వహిస్తున్నామన్నారు. ఎన్ఆర్‌పేట, భూపయ్యచెరువు, మెయిన్ విలేజ్, కొత్తపేట, సూర్య కాలనీ రమణా నగర్, నరసరాజనగర్, జిన్నూరుపాలెంలో సిల్టు తొలగింపు పనులు పూర్తి చేస్తామన్నారు. డ్రెయినేజీలు లేని చోట కచ్చా డ్రెయిన్లు తవ్వుతున్నట్లు వివరించారు.

'బిసిలకు జగన్ ప్రాధాన్యత'

ప్రజాశక్తి - పోడూరు

వైసిపి ప్రభుత్వ హయాంలో సిఎం జగన్ రాష్ట్రంలో బిసి కులాలన్నింటికీ ప్రాధాన్యత కల్పి స్తున్నారని జాతీయ బిసి మహాసభ పాలకొల్లు నియోజకవర్గ కన్వీనర్ చింతపల్లి రాధాకృష్ణ అన్నారు. జిన్నూరులో ఆదివారం ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగన్ అధికారంలోకి వచ్చాక ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి బిసిలకు న్యాయం చేస్తున్నారన్నారు. మంత్రివర్గంలోనూ, నామినేటెడ్ పదవుల్లోనూ బిసిలకు ప్రాముఖ్యత కల్పించారన్నారు. జగన్ నాలుగేళ్ల పాలనలో బిసిలకు చెందిన పేద, సామాన్య కుటుంబాలు విద్యాపరంగా, వ్యాపారపరంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందటం చూస్తున్నామన్నారు. సచివాలయ, వాలంటరీ వ్యవస్థ ద్వారా ఇంటింటికి రేషన్ ఏర్పాటుతో లక్షలాది మంది యువత ఉద్యోగాలు, ఉపాధి పొందారని తెలిపారు. బిసిల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంతో పాటు వారి సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేయడమే జాతీయ బిసి మహాసభ లక్ష్యమన్నారు. రాబోయే కాలంలో పాలకొల్లు నియోజకవర్గంలో అన్ని మండలాల్లోనూ కమిటీలు ఏర్పాటు చేసి బిసిలను చైతన్యం చేస్తామని రాధాకష్ణ తెలిపారు.

నేడు సీసలిలో గురుపౌర్ణమి వేడుకలు

ప్రజాశక్తి - కాళ్ల

సీసలిలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో సోమవారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నామని ట్రస్ట్ బోర్డ్ ఛైర్‌పర్సన్ తోరం అనంతలక్ష్మి సత్యవతిదేవి ఆదివారం విలేకరులకు తెలిపారు. ఆమె మాట్లాడుతూ 6 వేల లీటర్ల ఆవుపాలతో, రూ.7,200 రూపాయి బిళ్లలతో సాయిబాబాకు అభిషేకం నిర్వహిస్తున్నామన్నారు. ఆలయంలో పనిచేసే 250 మంది సేవకుల పిల్లలకు ఎల్‌కెజి నుంచి పిజి వరకు చదువుకునే వాళ్లందరికీ మెరిట్ స్కాలర్‌షిప్ అందిస్తున్నామన్నారు. యాత్రికులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

పింఛనుదారులకు ఇకెవైసి మినహాయించాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

పింఛనుదారులను ఇకెవైసి నుంచి మినహాయించాలని పెన్షనర్ల సంఘం మండల కార్యదర్శి పాలా నాగ వరప్రసాదరావు అన్నారు. ఆదివారం మార్టేరు రోటరీ క్లబ్ భవనంలో పెన్షనర్ల సంఘం సమావేశం తామాడ సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. సంఘం కార్యదర్శి పాలా నాగవర ప్రసాదరావు కార్యకలాపాల నివేదికను సమర్పించారు. ప్రతినెలా 1వ తేదీన పింఛన్లు జమ చేయాలని డిమాండ్ చేశారు. పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించి, ఇకెవైసి నుంచి మినహాయించాలి కోరారు. పింఛను దారులను ఆదాయపు పన్ను నుంచి మినహాయించి, 12వ వేతన సవరణ సంఘాన్ని తక్షణమే నియమించాలని కోరారు. ఆరోగ్య కార్డుల ద్వారా అన్ని ఆసుపత్రులలో నగదు రహిత చికిత్స అందించాలని తీర్మానం చేశారు. ఈ సమావేశములో గౌరవ అధ్యక్షులు చిర్ల సూర్యనారాయణ రెడ్డి, కోశాధికారి కేశవరెడ్డి, కొత్త సత్యనారాయణ మూర్తి, పోడూరి రామచంద్రరావు, చదువుల సుబ్రహ్మణ్యం ప్రసంగించారు. సభ ప్రారంభములో విశ్రాంత మండల విద్యా శాఖాధికారి కెఎం లలిత మరణించినందున 2 నిమిషాలు మౌనం పాటించారు.



మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం మండల కార్యదర్శి నాగ వరప్రసాదరావు

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - ఆకివీడు

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని, క్లబ్ 50 ఏళ్ల పూర్తి చేసుకోవడం శుభపరిణామమని జిల్లా కలెక్టర్ పి.ప్రసన్న అన్నారు. ఆకివీడు లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం స్థానిక లయన్స్ కన్వెన్షన్ హాల్లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి క్లబ్ 2022-23 సంవత్సర అధ్యక్షులు పిన్నమరాజు మురళీకృష్ణరాజు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రత్యేక అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్లబ్ 50 సంవత్సరాల పూర్తి చేయడం అభినందనీయమన్నారు. వ్యక్తి జీవితంలో తన కుటుంబం అనే విధంగా ఉంటారని, అయితే కొందరు సమాజానికి ఉపయోగపడాలనే లక్ష్యంతో పయనిస్తారని తెలిపారు. ఆ లక్షణంతో పాటు నాయకత్వ పటిమ, క్రమశిక్షణతో చక్కటి ఫలితాలను సాధించగలిగారన్నారు. ఇంతటి ఫలితాలు సాధించడానికి చక్కటి సమన్వయం ఒకరికొకరు సహకారం ఎంతో అవసరమన్నారు. సేవా కార్యక్రమాల్లో ఆకివీడు లయన్స్ క్లబ్ సమన్వయంతో ముందడుగు వేస్తోందన్నారు. లయన్స్ మల్టిపుల్ ఛైర్మన్ చిలుకూరి కృష్ణంరాజు మాట్లాడుతూ క్లబ్ ద్వారా ఇక్కడ విద్యా యజ్ఞం, వైద్య యజ్ఞం, సేవా యజ్ఞం అనే మూడు కార్యక్రమాలు చేపట్టామన్నారు. దీనిలో భాగంగానే సుమారు రెండు కోట్ల రూపాయలు ఖర్చుతో మధుమేహం, కిడ్నీ వ్యాధి ఇటువంటి వాటికి శాశ్వత వైద్యం అందించే విధంగా అతిపెద్ద ఆసుపత్రి నిర్మాణం ప్రారంభించామన్నారు. లయన్స్ రాష్ట్ర మాజీ ఛైర్మన్ డాక్టర్ ఎంవి.సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ ఆకివీడులో ప్రతి వెయ్యి మందిలో 30 మంది లయన్స్ సభ్యులు ఉన్నారని, ఇది అత్యంత అరుదైన సంఖ్య అని వివరించారు. ముందుగా నర్సింగ్ నారాయణ రాజు సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. డిఇఒ రమణ మాట్లాడుతూ లేబరేటరీలు సమకూర్చినందుకు లయన్స్ క్లబ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నూతన అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారి, ఉపాధ్యక్షులు వివి కృష్ణంరాజు, బుద్ధ చింతారావు, ఓలేటి సుబ్రహ్మణ్యం, కె.లక్ష్మీ నరసింహం, నెల్లి సతీష్‌కుమార్, గుర్రం శ్రీనివాసరావు, దాసరి సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శ్రమదానం

ప్రజాశక్తి - పాలకొల్లు

ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. బంగారు చెరువుగట్టు ఆవరణలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో పరిసరాలను శుభ్రం చేయించి, మార్గ మధ్యలో పిచ్చి మొక్కలను తొలగించారు. ఆదిత్య కళాశాలల డైరెక్టర్ ఎస్‌వి రాఘవరెడ్డి మాట్లాడుతూ నిత్యం పరిసరాలు శుభ్ర పరుచుకుని ఆరోగ్యంగా ఉండాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.గంగాధర్, వైస్ ప్రిన్సిపాల్ జి.లక్ష్మి నారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ కె.వినయ్, ఐ.రవికిరణ్, డిఎస్ గణేష్ పాల్గొన్నారు



శ్రమదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

'భీమవరంలో వారాహి యాత్ర విజయవంతం'

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వంద జన్మలు కాదు.. ఒక్క క్షణం జన సైనికునిలా బతికి చూపించాలని జనసేన జిల్లా అధ్యక్షులు చినబాబు వైసిపి నేతలకు సవాల్ విసిరారు. పవన్ కళ్యాణ్ యువతకు చేస్తున్న సేవలను చూసి వైసిపి నేతలు కళ్లు తెరిచి ప్రజా సేవ దృష్టి సారించాలన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నవరంలో ప్రారంభమై భీమవరంలో ముగిసిన మొదటి దశ వారాహి యాత్ర జయప్రదమైందన్నారు. సంస్కారవంతమైన మాటలతో అధ్యక్షులు పవన్ కళ్యాణ్ వారాహి యాత్రను భీమవరంలో విజయవంతం చేశారన్నారు. యాత్రకు సహాయ సహకారాలు అందించిన జన సైనికులకు, వీర మహిళలు, స్థానిక అధికారులు, పోలీస్ యంత్రాంగం, మీడియాకు చినబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికైనా వైసిపి నాయకులు నోటికి సైలెన్సర్లు బిగించి, గౌరవప్రధమంగా ఉండాలన్నారు. రాబోవు 2024 ఎన్నికల్లో ఉభయ గోదావరి జిల్లాలలో జనసేన జెండా ఎగరవేస్తామన్నారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లిలో బండి ముత్యాలమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. ఆషాడమాసం కావడంతో అమ్మవారికి కూరగాయలతో శాఖాంబరీ అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, ఛైర్మన్ కొల్లాటి రామారావు, ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలూ కలగకుండా ఏర్పాట్లు చేశారు.



విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న వాకర్స్ క్లబ్ అధ్యక్షులు సుధాకర్

విద్యార్థినికి వాకర్స్ క్లబ్ చేయూత

ప్రజాశక్తి - పాలకొల్లు

చింతపర్రుకు చెందిన శిద్దాని యామినికి వాకర్స్ క్లబ్ చేయూతనిచ్చింది. జెడ్‌పి హైస్కూల్లో పదో తరగతి చదివిన యామిని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. ఆమెకు తండ్రి లేకపోవడం, పేద కుటుంబం కావడంతో ఇంటర్లో జాయిన్ కాలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో వాకర్స్ క్లబ్ విద్యార్థినికి అండగా నిలిచింది. పాలకొల్లు కోకోనట్ జూనియర్ కళాశాలలో బైపిసి గ్రూప్‌కు కావాల్సిన అన్ని పుస్తకాలూ అందించి రూ.3 వేలు పారితోషికాన్ని క్లబ్ తరపున అధ్యక్షుడు తటవర్తి సుధాకర్ ఆదివారం పాలకొల్లులో ఆమెకు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమా శంకరావు, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, నంబూరి గంగా పవన్, ఉపాధ్యాయుడు రమేష్ పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు సారె

ప్రజాశక్తి - కాళ్ల

ఏలూరుపాడు గ్రామ దేవతలైన పోలేరమ్మ, పుంతలో ముసలమ్మ, ఎల్లమ్మ, దుర్గాదేవి అమ్మవార్లకు ఆదివారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని గ్రామదేవతలకు ఆషాడసారె బిందులతో మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ముఖ్యమైన దేవస్థానాల్లో అమ్మవార్లకు పసుపు, కుంకుమ, వివిధ రకాలైన పండ్లు స్వీట్స్, చీరలు, సారెలను సమర్పించారు. ఈ పూజల్లో అధిక సంఖ్యలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.



అమ్మవారికి సారె తీసుకెళ్తున్న మహిళలు